సాక్షి ఖమ్మం

సోమవారం । 8 । మే । 2023



బైపాస్.. ప్రమాదాలకు కేరాఫ్!

ఖమ్మం బైపాస్ రోడ్డులో పోలీసులు విధిస్తున్న ఆంక్షలు, వాహనదారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. 8లో



భయం గుప్పిట్లో ఆదివాసీలు

ఛత్తీస్‌గఢ్‌లోని పుట్టపాడులో జరిగిన ఎన్‌కౌంటర్‌తో సరిహద్దు భద్రాద్రి జిల్లా ఆదివాసీల్లో ఆందోళన నెలకొంది. 8లో

గరిష్టం / కనిష్టం 37° / 27°

వాతావరణం

సోమవారం జిల్లాలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఎండ పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి వారికి తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారి సేవల్లో పాల్గొన్నారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం..

రామాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారికి ఆదివారం నిర్వహించిన రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయంలో జరుగుతున్న తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం చేపట్టాల్సిన ఈ వేడుకను భారీ వర్షం కారణంగా రద్దు చేశారు. ఆదివారం ఉదయం ఆలయ ఈఓ రమాదేవి, అర్చకుల సమక్షంలో ఆలయం నుంచి తాతగుడి సెంటర్ వరకు రథోత్సవం జరిపారు. సాయంత్రం పవిత్ర గోదావరిలో తెప్పోత్సవం నిర్వహించారు. సోమవారంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

కిన్నెరసానిలో కోలాహలం



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం సందడి నెలకొంది. వేసవి సెలవులు కావడంతో పిల్లా పాపలతో కలిసి జిల్లా నలుమూలల నుంచే కాక పొరుగు జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు వచ్చారు. ఈ సందర్భంగా డీర్ పార్కులోని దుప్పులు, డ్యాం పైనుంచి జలాశయాన్ని వీక్షించాక బోటు షికారు చేశారు. కాగా, 660 మంది పర్యాటకుల ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.22,330, 360 మంది బోటింగ్ చేయడంతో టూరిజం శాఖకు రూ.22,130 ఆదాయం సమకూరింది.

రుణ లక్ష్యం రూ.931.68 కోట్లు!



ఎస్‌హెచ్‌జీలకు రుణ మంజూరు ప్రణాళిక ఖరారు

- తిరుమలాయపాలెం మండలానికి అత్యధికంగా రూ.67.65 కోట్లు
- స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తున్న సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలు స్వయం శక్తితో సొంత వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా బలోపేతమై కుటుంబాలకు అండగా నిలిచేలా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడిన మహిళలకు రుణాలు అందజేస్తోంది. ఈ రుణాలతో మహిళలు సొంత వ్యాపారాలు చేస్తూ ఎదగడమే కాక పలువురికి అండగా నిలుస్తున్నారు. జిల్లాలోని పలు సంఘాల్లోని సభ్యులు ఇప్పటికే వ్యాపారాల్లో రాణిస్తున్నారు. ఈనేపథ్యాన సంఘాలు అడిగినంత మేర బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్న జిల్లా అధికారులు తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 21,768 సంఘాలకు రూ.931.65 కోట్ల రుణాలు మంజూరు చేయాలనే లక్ష్యాన్ని అధికారులు చేరుకున్నారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం(2023–24)లో 16,642 సంఘాలకు రూ.931.68 కోట్లు రుణాలుగా ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

జిల్లాలో మండలాల వారీగా రుణ లక్ష్యం ఇలా

మండలం	ఎస్‌ఎస్‌జీలు	రుణ లక్ష్యం (రూ.ల్లో)
తిరుమలాయపాలెం	1,192	67,65,54,000
ఖమ్మం రూరల్	1,121	64,08,99,000
ముదిగొండ	1,028	55,90,18,000
పెనుబల్లి	887	55,90,18,000
కల్లూరు	988	54,18,26,000
కొణిజర్ల	960	53,73,20,000
తల్లాడ	886	52,77,80,000
కూసుమంచి	920	51,62,91,000
నేలకొండపల్లి	908	49,66,93,000
రఘునాథపాలెం	860	45,74,47,000
ఎర్రుపాలెం	701	42,61,54,000
బోనకల్	737	42,25,78,000
ఏన్కూరు	713	41,09,55,000
వేంసూర్	701	40,32,22,000
చింతకాని	760	38,68,70,000
సత్తుపల్లి	728	38,58,32,000
సింగరేణి	720	36,70,09,000
వైరా	599	34,39,94,000
కామేపల్లి	632	34,39,94,000
మధిర	599	31,74,12,000

ప్రణాళికాయుతంగా మంజూరు

సంఘాల సభ్యులు బ్యాంకుల్లో చేస్తున్న పొదుపునకు అనుగుణంగా వారికి అవసరమైన రుణాన్ని బ్యాంకుల ద్వారా ఇప్పించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టారు. గత ఆర్థిక సంవత్సరం ప్రణాళికల ఆధారంగా ప్రభుత్వం సూచనలతో ఈ ఏడాది ప్రణాళిక రూపొందించారు.

ఇప్పటికే బ్యాంకుల సిబ్బంది, అధికారులు సంఘాల బాధ్యులతో సమావేశమవుతూ మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను చేరుకునేందుకు సిద్ధమవుతున్నారు.

బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యం

ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన రుణాలపై ప్రభుత్వం బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించింది. జిల్లాలో పది బ్యాంకుల ఆధ్వర్యంలో రుణాలను మంజూరు చేయనున్నారు. ఇందులో ఏపీజీవీబీ ద్వారా 9,765 సంఘాలకు రూ.545.52 కోట్లు, ఎస్‌బీఐ నుండి 3,376 సంఘాలకు రూ.183.88 కోట్లు, యూనియన్ బ్యాంక్ నుండి 1,922 సంఘాలకు 108.24 కోట్లు, ఐఓబీ నుండి 460 సంఘాలకు 29.47 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ ద్వారా 501 సంఘాలకు 28.16 కోట్లు, డీసీసీబీ నుండి 194 సంఘాలకు 12.33 కోట్లు, ఇండియన్ బ్యాంక్ నుండి 187 సంఘాలకు 10.97 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా నుండి 91 సంఘాలకు రూ.5.19 కోట్లు, కెనరా బ్యాంక్ నుండి 89 సంఘాలకు రూ.4.58 కోట్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి 55 సంఘాలకు రూ.3.21 కోట్లు రుణాలు ఇవ్వాలని రుణప్రణాళికలో వెల్లడించారు.

ఆసక్తి మేరకు రుణాలు

సంఘాల్లోని సభ్యులైన మహిళలు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలతో వ్యాపారాలు చేస్తూ తిరిగి సకాలంలో చెల్లిస్తుండడం ద్వారా బ్యాంకులు ఎంత రుణమైనా ఇచ్చేందుకు ముందుకొస్తున్నాయి. ఈ రుణాలతో టైలరింగ్, డెయిరీ ఫాం, కిరాణం, చిరు వ్యాపారాలు పెట్టుకుని మహిళలు జీవనోపాధి పొందుతున్నారు. జిల్లాలో మొత్తం 25,032 వేలకు పైగా సహాయక సంఘాలు, సుమారు 2,58,336 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 16,642 సంఘాలు బ్యాంక్ లింకేజీ రుణాలకు అర్హత సాధించగా, ప్రభుత్వం రూ.931.68 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించింది.

అర్హులైన సంఘాలన్నింటికీ రుణాలు



జిల్లాలో అర్హులైన సంఘాలన్నింటికీ బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందించి స్వయం ఉపాధి పొందేలా చూస్తున్నాం. ఈ ఏడాది జిల్లాకు రూ.931.68 కోట్లు లక్ష్యంగా నిర్దేశించారు. అర్హులైన సంఘాలు, సభ్యులకు రుణాలు ఇస్తూ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాం.

– ఎం.విద్యాచందన, డీఆర్డీఓ

పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలు





సభలో మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన డీసీసీబీ చైర్మన్ నాగభూషణం తదితరులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎంపీ నాగేశ్వరరావు

- అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి
- ఓట్లు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కు తప్ప మరెవరికీ లేదు..
- బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ, ఎంపీ నామ

రఘునాథపాలెం: బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలని.. తమ చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా వారి రుణం తీర్చుకోలేమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. రఘునాథపాలెం మండలం మంచుకొండలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో ఆదివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అజ్మీరా వీరూనాయక్ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేశారు. ఈసభలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేసి చూపిస్తున్నారని తెలిపారు. అన్ని కుటుంబాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిన నేపథ్యాన బీఆర్‌ఎస్‌కు తప్ప మరెవరికీ ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. పదవులు దక్కలేదనే అసంతృప్తితో కొందరు చేస్తున్న తప్పుడు ఆరోపణలను కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. 2014, 2018 ఎన్నికల్లో ప్రజలు, కార్యకర్తల దయతో గెలిచిన తాను అందరికీ అభివృద్ధి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నానని చెప్పారు. ఈమేరకు అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో గెలుపునకు ఇప్పటి నుంచే కృషి చేయాలని మంత్రి సూచించారు. కాగా, మండలంలోని మట్టి గుట్టలను కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవే పనులకు కేటాయిస్తే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, తవ్వకాలు పూర్తయ్యాక ఆ భూమిని ఇళ్లు లేని పేదలకు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం... ఎంపీ నామా నాగేశ్వరరావు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించడం, కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని ఎంపీ నామా నాగేశ్వరరావు వెల్లడించారు. కేసీఆర్‌ను గద్దె దించే సత్తా ఎవరికీ లేదని, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే గెలుపునకు బాటలు వేస్తాయని తెలిపారు. ఈ రోజు తాము పదవులను అనుభవించడానికి కార్యకర్తల కృషే కారణమని చెప్పారు. ఈ సభలో డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్, నాయకులు, ప్రజాప్రతినిధులు మందడపు నర్సింహారావు, గుత్తా రవి, మద్దినేని వెంకటరమణ, పగడాల నాగరాజు, కొంటిముక్కల వెంకటేశ్వర్లు, పిన్ని కోటేశ్వరరావు, బానోతు ప్రమీల, కుర్రా భాస్కర్రావు, మందడపు సుధాకర్, భూక్యా లక్ష్మణ్‌నాయక్, కాంపాటి రవి, చెరుకూరి ప్రదీప్, మెంటం రామారావు, మంద సంజీవరావు, తాతా వెంకటేశ్వర్లు, సూదగాని సంగయ్య, కాంపాటి రవి, బానోతు శివలాల్, తేజావత్ రమేశ్, బండి వెంకన్న, అజయ్ మీరా, వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఏఈఈ పరీక్ష

- హాజరుకానున్న 3,001మంది అభ్యర్థులు
- ఈసారి ఆన్‌లైన్ విధానంలో నిర్వహణ

ఖమ్మం సహకారనగర్: ప్రశ్నపత్రాల లీకేజీతో వాయిదా వేసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) నియామక పరీక్షను సోమ, మంగళ వారాల్లో నిర్వహించాలని టీఎస్‌పీఎస్‌సీ నిర్ణయించింది. గతంలో మాదిరి ప్రశ్నపత్రాలతో కాకుండా ఈసారి ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు కంప్యూటర్ల సౌకర్యం కలిగిన ఇంజనీరింగ్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంచుకున్నారు. జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో సోమవారం 1,661మంది, మంగళవారం 1,340 మంది కలిపి 3,001మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు.

పరీక్షా కేంద్రాలివే...

ఏఈఈ నియామకాల పరీక్ష కోసం జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఖమ్మంలోని ఎస్‌బీఐటీ, అల్లీపురంలో బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల, తనికెళ్ల వద్ద విజయ ఇంజనీరింగ్ కళాశాల, ఖమ్మం రూరల్ మండలంలోని సత్యనారాయణపురం వద్ద దరిపల్లి ఇంజనీరింగ్ కళాశాల, పెద్దతండాలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల, పాన్నెకల్‌లోని ఖమ్మం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. పరీక్ష ఉదయం పరీక్ష 10నుంచి 12–30గంటల వరకు జరగనుండగా, 8–30నుంచి 9–30గంటల వరకే అభ్యర్థులను అనుమతిస్తారు. ఇక మధ్యాహ్నం పరీక్ష 2–30నుంచి 5గంటల వరకు జరగనుండగా... అభ్యర్థులను మధ్యాహ్నం 1–15నుంచి రెండు గంటల వరకు అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు. కాగా, పరీక్షకు చీఫ్ సూపరింటెండెంట్లుగా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, లైజనింగ్ అధికారులు, అసిస్టెంట్ లైజనింగ్ అధికారులుగా, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సూపర్‌వైజింగ్ కోసం వివిధ శాఖల అధికారులకు విధులు కేటాయించారు.

రామాలయంలో సంస్కరణలు

- దేవస్థానం అభివృద్ధి, ఆదాయ పెంపుపై దృష్టి
- ఆలయ ప్రతిష్టను బదనాం చేస్తే సహించం
- లడ్డూల కొరత ప్రచారం అవాస్తవం
- ఈఓ రమాదేవి వెల్లడి



మాట్లాడుతున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం సులభంగా కల్పించడంతో పాటు రామాలయానికి వచ్చే ప్రతి రూపాయిని వెచ్చించి సమగ్రాభివృద్ధి సాధించేలా పలు సంస్కరణలు చేపడతామని ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత శ్రీరామనవమి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. నూతన ఆర్జిత సేవలకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా కార్గో, పోస్టల్ ద్వారా ప్రవేశపెట్టిన ముత్యాల తలంబ్రాల అమ్మకం సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. గతేడాది 26 లక్షల ప్యాకెట్లను అమ్మితే, ఈ సంవత్సరం 36 లక్షల ప్యాకెట్లు విక్రయించామని తెలిపారు. పర్ణశాలలోనూ భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. దేవస్థానానికి వచ్చే ప్రతీ భక్తుడికి ప్రశాంతంగా స్వామి వారి దర్శనంతో పాటు తాగునీరు, నీడ కల్పించేలా చర్యలు తీసుకున్నామని, ఈ క్రమంలోనే జల ప్రసాదం మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు చేశామని ఈఓ రమాదేవి వెల్లడించారు. దుకాణదారుల, టెండర్‌దారుల మొండి బకాయిలను వసూలు చేస్తున్నామని, నెలన్నర వ్యవధిలోనే సుమారు రూ.80 లక్షలు వసూలు చేశామని ఆమె తెలిపారు.

ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించొద్దు

దేవస్థానంలో లడ్డూల ప్రసాదం కొరత ఉందనే ప్రచారం అవాస్తవమని, ఇలా ఆలయ ప్రతిష్టను బదనాం చేసేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓ హెచ్చరించారు. ఆలయంలో లడ్డూ ప్రసాదం తయారీ టెండర్‌లు కోవిడ్ అనంతరం ఉన్న కాంట్రాక్టర్‌కు బదిలీ చేశారని, ఆయన గడువు శ్రీరామనవమికి ముందు ముగిసినా భక్తులు ఇబ్బంది పడకూడదని ఏప్రిల్ 30 వరకు పొడిగించామని తెలిపారు. అయితే దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రీ టెండర్‌ను నిర్వహించాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించామని చెప్పారు. అయితే ఆ కాంట్రాక్టర్ గత నెల 30న ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే పనులను అర్ధాంతరంగా వదిలేసి వెళ్లాడని తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయంలో అధికారులు, అర్చకులు, సిబ్బంది సహకారంతో లడ్డూల నాణ్యతలో రాజీ లేకుండా తయారు చేస్తున్నామని, భక్తులు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వివరించారు. కానీ కొందరు లడ్డూల కొరత అంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 22న లడ్డూల తయారీ టెండర్‌ను పారదర్శకంగా నిర్వహిస్తామని, ఈ విషయంలో ఎవరి ఒత్తిడికీ తలొగ్గేది లేదని స్పష్టం చేశారు. భక్తులకు నూతన ప్రసాదాలు అందించేలా ప్రణాళికలను రూపొందిస్తున్నామని, కోవిడ్ సమయంలో నిలిపివేసిన ఉచిత ప్రసాద వినియోగాన్ని త్వరలో పునరుద్ధరిస్తామని వెల్లడించారు.

రామయ్యకే భూములు చెందేలా చూస్తాం

వివిధ ప్రాంతాలలో ఆక్రమణలకు గురవుతున్న, వివాదాల్లో ఉన్న దేవస్థానం భూములు రామయ్యకే చెందేలా కృషి చేస్తానని ఈఓ తెలిపారు. ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగంలో తనకున్న అనుభవంతో వివిధ రాష్ట్రాల్లో ఉన్న దేవస్థాన భూముల వివరాలు సేకరిస్తునామని చెప్పారు. ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న భూముల ఆక్రమణలపై పాడేరు కలెక్టర్‌ను కలిసినట్లు తెలిపారు. ఏపీ హైకోర్టు పిల్ ప్రకారం ఆ భూముల్లో ఆక్రమణలను తొలగించి ఆలయానికి అప్పగించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. సోమవారం ఉదయం యటపాకలో అక్కడి అధికారులు, రైతులతో సమావేశం ఉందని తెలిపారు. ఆ భూముల స్వాధీనం అనంతరం దాతల సహకారంతో పెన్సింగ్, ప్రహరీ నిర్మిస్తామన్నారు. ఆలయానికి దాతలు అందించే ప్రతీ రూపాయి, బంగారు, వెండి ఆభరణాలు రామయ్యకే చెందేలా చర్యలు తీసుకున్నామని ఈఓ వివరించారు.

పోలీసు ఉద్యోగులకు సేవా పతకాలు



అంజలి, ట్రాఫిక్ సీఐ

ఖమ్మం క్రైం: పోలీసు శాఖలోని పలువురు అధికారులు, సిబ్బందికి 2022 సంవత్సరంలో అందించిన సేవలకు రాష్ట్రప్రభుత్వం పతకాలను ప్రకటించింది. వచ్చేనెల 2న జరగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ పతకాలు ప్రకటించారు. ఖమ్మం ట్రాఫిక్ సీఐ అంజలికి ఉత్కృష్ట సేవా పతకం, ఇంటెలిజెన్స్ ఏఎస్సై సాయిబాబాకు మహోన్నత పతకం, ఖమ్మం ఏఆర్ ఎస్సై ఎం.డీ.గౌస్ పాషాకు మహోన్నత సేవా పతకంతో పాటు ట్రాఫిక్ ఎస్సై బి.వెంకటాచారి, సీసీఆర్బీ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసరావు, ట్రాఫిక్ కానిస్టేబుల్ పాపారావుకు ఉత్తమ సేవా పతకాలు లభించింది. వచ్చేనెల 2న హైదరాబాద్ రవీంద్రభారతితో జరగనున్న సమావేశంలో వీరికి పతకాలు అందజేస్తారు.

ప్రశాంతంగా 'నీట్'

- జిల్లాల్లోని ఐదు కేంద్రాల్లో 3,079మంది హాజరు
- ఉదయం నుంచే చేరుకున్న విద్యార్థులు
- ఆలస్యంగా వచ్చిన వారికి అనుమతి నిరాకరణ



హాల్‌టికెట్ నంబర్లు చూస్తున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యాన నిర్వహించిన నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు(నీట్) ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 3,118 మంది విద్యార్థులకు 3,079మంది హాజరయ్యారు. ఇక 39 గైర్హాజరయ్యారని పరీక్షల సిటీ కోఆర్డినేటర్ పార్వతీరెడ్డి తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5–20గంటల వరకు నిర్వహించగా, విద్యార్థులను ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1–30గంటల వరకే అనుమతిస్తామని నిర్వాహకులు ముందుగానే ప్రకటించారు. దీంతో వివిధ ప్రాంతాల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ముందుగానే చేరుకున్నారు. కాగా, కొందరు విద్యార్థులు చెవిదిద్దులు, వాచ్‌లు, ఇతర సామగ్రితో రావడంతో నిర్వాహకులు అనుమతించలేదు. దీంతో అక్కడికక్కడే తీసి తల్లిదండ్రులకు ఇవ్వడం కనిపించింది. అలాగే, సొంతంగా మాస్క్ తెచ్చుకున్నా తీసివేయించారు.

నిబంధనలు పక్కాగా..

నీట్ పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనలు పటిష్టంగా అమలు చేశారు. ఉదయం 11గంటల నుంచే అభ్యర్థులను అనుమతించటంతో పాటు మధ్యాహ్నం 1–30గంటలకు గేట్లు మూసివేశారు. ఆతర్వాత అభ్యర్థులను వెనక్కి పంపించారు. రఘునాథపాలెం సమీపంలోని ఎస్‌ఈఎస్ వీవీసీ పాఠశాల కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన ఇద్దరు అభ్యర్థులను అనుమతించకపోవడంతో వారు నిరాశగా వెనుదిరిగారు. అలాగే, కవిత కాలేజీకి మరో విద్యార్థి ఆలస్యంగా రాగా అనుమతి నిరాకరించారు.

చివరి నిమిషంలో ఉరుకులు

విద్యార్థులు ఎక్కువ మంది ముందుగానే చేరుకున్నప్పటికీ కొందరు ఆఖరి నిమిషంలో ఉరుకులు పరుగులతో వచ్చారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో విద్యార్థుల ఫొటో, గుర్తింపు, అడ్మిట్ కార్డులను పరిశీలించడమే కాక శానిటైజర్ వేసి మాస్క్, పెన్నులు తదితర సామగ్రిని అందించారు.

ప్రజాసేవ చేసేందుకే రాజ్యసభకు..



ఎంపీ పార్థసారథిరెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం బాధ్యులు

- ఖమ్మంలో రెడ్డి సంక్షేమ భవనానికి రూ.కోటి ఇస్తా..
- సన్మానసభలో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి

ఖమ్మంఅర్బన్: ఎంత డబ్బు ఉన్నా వెంట రాదనే విషయాన్ని గుర్తించి నలుగురికి సాయపడే పనులు చేయాలని తద్వారా మంచి పేరు లభిస్తుందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. అలాగే, పిల్లలను చదివిస్తూనే సమాజసేవ వైపు పయనించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ఖమ్మంలో ఆదివారం జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఆత్మీయ సన్మానసభలో ఎంపీ మాట్లాడారు. పిల్లలకు ఆస్తులు కంటే విజ్ఞానం అందించి స్వతహాగా జీవించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పార్లమెంట్ సభ్యుల వ్యక్తిగత ఖర్చుల కోసం కేంద్రప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులు కేటాయిస్తుండగా, ఆర్థిక స్తోమత ఉన్న సభ్యులు తిరస్కరించే అవకాశమున్నా శ్రీమంతులు సైతం స్వీకరిస్తున్నారని తెలిపారు. కానీ తాను మాత్రం ప్రభుత్వ సొమ్ము పైసా తీసుకోకుండా ప్రజాసేవ చేసేందుకే రాజ్యసభ సభ్యత్వం స్వీకరించినట్లు చెప్పారు. ఈమేరకు సదుపాయాలు, రవాణా చార్జీలు, వసతి సౌకర్యం కోసం కేంద్రం ఇచ్చే నిధులను పీఎం సహాయనిధికి, రాష్ట్రం నుండి వచ్చే వాటిని సీఎం సహాయనిధికి ఇచ్చేలా నిర్ణయించినట్లు తెలిపారు. కులమేదైనా మంచిని స్వీకరించి, నలుగురికి ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. రెడ్డి సంక్షేమ సంఘం విజ్ఞప్తి మేరకు ఖమ్మంలో రెడ్డి సంక్షేమ భవన్ నిర్మాణానికి రూ.కోటి విరాళంగా ఇస్తున్నట్లు ఎంపీ ప్రకటించారు. అనంతరం రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ఎంపీ పార్థసారథిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మొగిలి శ్రీనివాసరెడ్డితో పాటు శీలం వెంకట్‌రెడ్డి, ఐలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, నూకల నరేష్‌రెడ్డి, వంగ సాంబశివారెడ్డి, మంజునాథరెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, బండి గురునాథరెడ్డి, డాక్టర్ రాఘవరెడ్డి, గాదె మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, దండా అయప్పరెడ్డి, వంటికొమ్ము శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎంపీ కైకొండాయిగూడెం క్రాస్‌లోని ఆంజనేయ దేవాలయంలో పూజలు చేయగా, అక్కడి నుంచి ర్యాలీగా సభకు వచ్చారు. ఇక ఈ సభకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కూడా పాల్గొని ఎంపీ పార్థసారథిరెడ్డిని సన్మానించారు. ఆయన వెంట డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్నిరంగాల్లో నగరాభివృద్ధి

ఆర్యవైశ్యుల సమ్మేళనంలో మంత్రి



సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ

ఖమ్మం గాంధీచౌక్: ఒకప్పుడు దుర్భరమైన స్థితిలో ఉన్న ఖమ్మం త్రీ టౌన్ ఇప్పుడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తద్వారా వ్యాపారాలు మరింత అభివృద్ధి సాధిస్తున్నాయని చెప్పారు. ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దశాబ్దాలుగా వివక్షతకు గురైన త్రీ టౌన్‌లో ఇప్పుడు రోడ్లను విస్తరించడమే కాక సెంట్రల్ లైటింగ్, గోళ్లపాడు ఛానల్ ఆధునికీకరణ, పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, జంక్షన్ అభివృద్ధితో కళకళలాడుతోందని తెలిపారు. నగరంలోని వర్తక, వ్యాపారులకు అండగా నిలుస్తున్నానే తప్ప ఏనాడు ఏం ఆశించలేదని గుర్తుచేశారు. కాగా, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని మంత్రి తెలిపారు. ఈసమావేశానికి ఆర్యవైశ్య సంఘం నాయకుడు కొత్త వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు, వర్తక సంఘం అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, మార్కెట్ చైర్‌పర్సన్ దోరెపల్లి శ్వేతతో పాటు వనమా సూరి, వేములపల్లి వెంకటేశ్వరరావు, దేవత అనిల్, కురువెల్ల ప్రవీణ్, వనమా విశ్వేశ్వరరావు, రాయపూడి వెంకటరామారావు, వదినేపల్లి శ్రీనివాసరావు, జీ.వై.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా పురస్కార్‌కు ఎంపిక



అవార్డు అందుకుంటున్న రజనీకాంత్

కల్లూరు: అఖిలభారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా అధ్యక్షుడు, కల్లూరుకు చెందిన కాటేపల్లి రజనీకాంత్ జాతీయ అయ్యప్ప సేవా పురస్కార్ అవార్డు లభించింది. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్న దేశంలోని 108 మంది అయ్యప్ప గురుస్వాములను అవార్డుకు ఎంపిక చేయగా, రజనీకాంత్‌కు స్థానం దక్కింది. తాజాగా అవార్డు అందుకున్న ఆయనను పలువురు అభినందించారు.

గోదావరిలో మునిగి విద్యార్థి మృతి



మనోహర్(ఫైల్)

భద్రాచలంఅర్బన్: కుటుంబ సభ్యులతో కలిసి శనివారం గోదావరిలో స్నానానికి దిగిన విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందాడు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం గడ్డికుంట గ్రామానికి గుగులోత్ మనోహర్ (17) పదో తరగతి చదువుతున్నాడు. శనివారం తండ్రి కిషన్, తల్లి భద్రమ్మ, తమ్ముడు చరణ్‌తో కలిసి భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దర్శనానికి వచ్చారు. ఈ క్రమంలో గోదావరిలో స్నానం చేసేందుకు గోదావరిలో దిగారు. లోతును అంచనా వేయలేక మనోహన్ నీట మునిగి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు ఏపీకి జిల్లా అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగుపై అధ్యయనం చేసేందుకు జిల్లా వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళతారని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాని చింతపల్లి, జీకే వీధి, లంబసింఘి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట, అరకు తదితర ప్రాంతాల్లో ఈనెల 8 నుంచి 11 వరకు పర్యటిస్తారని వివరించారు. సాగులో ఉన్న పలు రకాల చిరుధాన్యాలు, ఆపిల్, మిరియాలు, కాఫీ, అనాస, యాలకు, స్ట్రాబెర్రీ, దాల్చినచెక్క, కర్పూరం, కోల్‌క్రాప్స్ తదితర తోటలతో పాటు ప్రాంతీయ పరిశోధనా కేంద్రాలను, అభ్యుదయ రైతు క్షేత్రాలను, రైతు భరోసా కేంద్రాలను సందర్శిస్తారని తెలిపారు. జిల్లాలో ఆయిల్‌పామ్ పంటలో అంతర సాగు చేపట్టేందుకు అవసరమైన చర్యలపై అధ్యయనం చేస్తారని పేర్కొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పోలీసులు ఇద్దరు వ్యక్తులపై ఆదివారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీకి ఆదిత్య వద్ద నుంచి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు రూ.30 వేలు తీసుకుని, ఫోన్ పే చేసినట్లు ఫేక్ మెసేజ్ చూపి ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు శివ కుమార్, రోహిత్‌లుగా గుర్తించారు. చీటింగ్ కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

భయం గుప్పిట్లో ఆదివాసీలు

- పుట్టపాడు ఎన్‌కౌంటర్‌తో ఉలిక్కిపడిన ఏజెన్సీ
- నాడు ఆరుగురు మావోయిస్టులు హతం
- నేడు మళ్లీ అదే ప్రాంతంలో ఇద్దరు..
- ద్రోహి ఇచ్చిన సమాచారంతోనే అని మావోయిస్టుల ఆరోపణ



ఎన్‌కౌంటర్ జరిగిన పుట్టపాడు గ్రామం

చర్ల: పుట్టపాడు ఎన్‌కౌంటర్ ఏజెన్సీని ఉలిక్కిపాటుకు గురి చేసింది. రెండేళ్లుగా ప్రశాంతంగా ఉన్న మండలంలో జరిగిన ఎదురుకాల్పుల ఘటన అటు ఛత్తీస్‌గఢ్ ఇటు తెలంగాణలోని ఆదివాసీ పల్లెలను భయాందోళనలకు గురి చేస్తోంది. పుట్టపాడు గ్రామంలోని ఇళ్లలో ఆదివారం ఒక్కరు కూడా కనిపించలేదు. ఇక ఎన్‌కౌంటర్ జరిగిన కొద్ది గంటల్లోనే ఘటనను ఖండిస్తూ మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖ ఇటు బీఆర్‌ఎస్ పార్టీ నేతలు అటు పోలీస్ ఇన్‌ఫార్మర్లకు చెమటలు పట్టిస్తోంది. ద్రోహి ఇచ్చిన సమాచారంతోనే ఎల్‌ఓఎస్ కమాండర్ రాజేష్‌ను పట్టుకుని చిత్రహింసలు పెట్టి చంపారంటూ మావోయిస్టు పార్టీ ప్రకటించిన నేపథ్యంలో ఆ ద్రోహి ఎవరు, ఆ నేరం ఎవరిపై పడుతుందనే దానిపై సరిహద్దు జనం వణికిపోతున్నట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

ప్రభావం ఎవరిపైనో..

పుట్టపాడు ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యంలో సరిహద్దుల్లోని ఆదివాసీ పల్లెల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రతీసారి మావోయిస్టులు అందుకు బాధ్యులను చేస్తూ కొరియర్ల పేరుతో పలువురిని హతమార్చుతున్నారు. ఈ క్రమంలో పుట్టపాడులో ఎన్‌కౌంటర్ జరిగిన కొద్ది గంటలల్లోనే లేఖ విడుదల చేసి బీఆర్‌ఎస్ నాయకులకు, ఇన్‌ఫార్మర్లకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఈ ప్రభావం ఎవరిపై పడుతుందోనని ఎర్రంపాడు, చెన్నాపురం, పుట్టపాడు, పెసర్లపాడు, తెట్టెమడుగు, డోకుపాడు, నిమ్మలగూడెం, కర్రిగుండం తదితర గ్రామాల ఆదివాసీలు వణుకుతున్నారు. రెండేళ్ల తరువాత సరిహద్దు ప్రాంతంలో మళ్లీ ఎన్‌కౌంటర్లు ప్రారంభమైనట్లు తాజా ఘటనను బట్టి తెలుస్తోంది. రెండేళ్ల క్రితం పుట్టపాడు సమీపంలోని పెసర్లపాడులో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా, ఆ తర్వాత ప్రశాంత వాతావరణం నెలకొంది.

మావోయిస్టులకు కలిసి రాని ప్రాంతం

2021 డిసెంబర్‌లో పుట్టపాడు సమీపంలోని పెసర్లపాడు అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళా సభ్యులతో సహా ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఇప్పుడు మళ్లీ మండలంలో ఎన్‌కౌంటర్ జరిగి ఇద్దరు మావోయిస్టులు మృతి చెందడంతో ఈ ప్రాంతం మావోయిస్టులకు కలిసి రాలేదని తెలుస్తోంది.

హెచ్‌ఎల్‌ఏ సగం కలిసినా శస్త్రచికిత్సలు

- తలసేమియాపై ప్రజల్లో అవగాహన పెరగాలి
- చిన్నపిల్లల వైద్యనిపుణులు మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షుడు రాజేష్ గార్గే



నృత్యం చేస్తున్న తలసేమియా బాధిత చిన్నారులు

ఖమ్మం వైద్యవిభాగం: తలసేమియా బాధితులకు బోన్‌మ్యారో చికిత్స ఒక్కటే మార్గమని.. హెచ్‌ఎల్‌ఏ మొత్తం కలిస్తేనే ఇన్నాళ్లు చికిత్స చేసినా భవిష్యత్‌లో సగం కలిసినా ఆపరేషన్లు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు చిన్నపిల్లల వైద్యనిపుణులు(అంకాలజిస్ట్) మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఖమ్మంలో ఆదివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ తలసేమియా దినోత్సవం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాజేష్ గార్గె అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పదేళ్ల క్రితం తలసేమియా వ్యాధి ఏమిటో అవగాహన లేకపోగా, ఖమ్మంలో వ్యాధి బారిన పడిన చిన్నారులకు సేవలందిస్తున్న సంకల్ప సంస్థ కృషి అభినందనీయమని తెలిపారు. తాను వైద్యవిద్యలో పీజీ చేసే సమయాన నాగ్‌పూర్‌లో తలసేమియా కేసులు ఎక్కువగా చూశానని, వ్యాధి నిర్మూలన, చికిత్స కోసం బెంగళూరుకు చెందిన సంకల్ప్ ఇండియా సంస్థతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. సంకల్ప సంస్థ ద్వారా ఆరుగురు చిన్నారులకు బోన్‌మ్యారో ఆపరేషన్లు చేస్తే నలుగురికి విజయవంతమైందని తెలిపారు. త్వరలోనే హెచ్‌ఎల్‌ఏ సగం కలిసిన వారికి ఆపరేషన్లు చేస్తామన్నారు. సంస్థ అధ్యక్షుడు రాజేష్ గార్గె మాట్లాడుతూ పదమూడేళ్లుగా తాము తలసేమియా బాధిత చిన్నారులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దాతలను సత్కరించగా, చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా సంకల్ప్ ఇండియా ద్వారా పలువురు చిన్నారుల కుటుంబాలకు హెచ్‌ఎల్‌ఏ పరీక్షలు చేశారు. వైద్యులు డాక్టర్ అభిజిత్, గిరిసింహారావు, డి.నారాయణమూర్తి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ గోపి, మేనేజర్ శ్రీనివాస్, పారా ఉదయ్, సంకల్ప సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పి.చంద్రలీలతో పాటు పి.పావని, పి.రవిచందర్, పి.ఉదయ్‌భాస్కర్, పి.అనిత, పి.వంశీకిరీటి, పి.ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం

దమ్మపేట: పొగాకును ఉడికిస్తున్న క్రమంలో మంటలు చెలరేగి బ్యారెన్ దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ముష్టిబండ గ్రామశివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ముష్టిబండ గ్రామానికి చెందిన రైతు చేబ్రోలు రామకృష్ణ తాను పండించిన పొగాకును గ్రామ శివారు శివాలయం సమీపంలోని బ్యారెన్‌లో ఉడికిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అకస్మాత్తుగా బ్యారెన్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందడంతో రైతులంతా వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. రైతుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే బ్యారెన్‌లో ఉన్న పొగాకు పూర్తిగా కాలిపోయింది. పక్కనే ఉన్న బ్యారెన్లకు మంటలు వ్యాపించకుండా ఆపగలిగారు. రూ.6 లక్షల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బైపాస్.. ప్రమాదాలకు కేరాఫ్!

- నూతన బస్టాండ్ వద్ద తరచుగా ప్రమాదాలు
- బారికేడ్ల ఏర్పాటుతో తగ్గిన వెడల్పు
- ఇష్టారాజ్యంగా నిలుపుతున్న వాహనాలతో మరింత ఇబ్బంది



శనివారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సును ఢీకొట్టి డివైడర్‌పైకి దూసుకెళ్లిన కాంక్రీట్ మిక్చర్ ట్యాంకర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని బైపాస్ రోడ్డుపై ప్రమాదాలకు నిలయంగా మారింది. నూతన బస్టాండ్ పరిసరాల్లో బైపాస్ రోడ్డుపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్టాండ్‌లోకి వచ్చివెళ్లే బస్సులు, ఇతర వాహనాలు రోడ్డు దాటే సమయంలో ఇతర భారీ వాహనాలు ఢీకొంటున్నాయి. తాజాగా శనివారం అర్ధరాత్రి నూతన బస్టాండ్ ఎదుట బస్టాండ్‌లోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సును కాంక్రీట్ మిక్చర్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఆపై లారీ అదుపు తప్పి డివైడర్‌పైకి ఎక్కింది. అయితే, బస్సు డిపో నుండి బస్టాండ్‌కు వస్తుండడంతో ప్రయాణికులు లేనందున ప్రమాదం తప్పినట్లయింది. ఇలా గతంలోనూ అనేక ప్రమాదాలు జరిగాయి.

ప్రమాదాలకు కారణమవుతున్న బారికేడ్లు

నూతన బస్టాండ్ ఎదుట ఉన్న బైపాస్ రోడ్డు వరంగల్ నుండి అశ్వారావుపేట వెళ్లేందుకు ప్రధాన రహదారి. నిత్యం వందలాది భారీ వాహనాలతో పాటు కార్లు, ఇతర వాహనాలు వచ్చివెళ్తుంటాయి. అయితే ఖమ్మం బస్టాండ్ వద్ద బైపాస్ రోడ్డుపై ఇష్టానుసారంగా బారికేడ్లు ఏర్పాటు చేయడం, వన్‌వేలు పెట్టడం ప్రమాదాలకు కారణమవుతోంది. బస్టాండ్ ఇన్ గేటు పక్కన పార్కింగ్ కోసం వెళ్లే వాహనాల కోసం వన్‌వే ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీసులు సిమెంట్ రాళ్లను బస్టాండ్ ముందు రోడ్డుపైకి వచ్చేలా పెట్టడంతో రోడ్డు వెడల్పు తగ్గి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక బస్సులు బస్టాండ్‌లోకి మళ్లించే సమయాన రోడ్డు వెడల్పు సరిపడక ఇతర వాహనాలకు తగులుతున్నాయి. అలాగే, బైపాస్‌పై వేగంగా వచ్చే వాహనాలు ఇక్కడ వేగం అదుపు కాక ఇతర వాహనాలను ఢీకొంటున్నాయి.

కేసు నమోదు చేసిన పోలీసులు

ఖమ్మం క్రైం/ఖమ్మం మామిళ్లగూడెం: అతివేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కాంక్రీట్ మిక్చర్ ట్యాంకర్ డ్రైవర్ డివైడర్‌పైకి ఎక్కించాడు. పాల్వంచ నుండి కోదాడ వెళ్తున్న కాంక్రీట్ ట్యాంకర్ డ్రైవర్ అతివేగంగా నడుపుతూ వచ్చి డిపో నుంచి కొత్త బస్టాండ్‌లోకి వెళ్తున్న రాజధాని బస్సు వెనక భాగంలో ఢీకొట్టాడు. అయితే, ట్యాంకర్ డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగానే ఈ ప్రమాదం జరగగా, బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూ టౌన్ పోలీసులు తెలిపారు.

ఇష్టానుసారంగా వాహనాలు

కొత్త బస్టాండ్ ఎదుట బైపాస్ రోడ్డుకు ఇరువైపులా వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ కార్లు, జీపులు, ఆటోలు రోడ్డుపైనే నిలుపుతుండడంతో భారీ వాహనాల రాకపోకలకు ఏర్పడుతోంది. దీనికి ఓ పక్కన తోపుడు బండ్లు పెట్టుకుంటుండడం, మరో పక్క కార్లు, ఇతర వాహనాలు నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన యంత్రాంగం వన్‌వేల పేరిట మరింత ఇబ్బంది పెడుతోందని వాహనదారులు వాపోతున్నారు.

● 'నీట్'గా ముగిసింది..



చెవిదిద్దులు తొలగిస్తున్న విద్యార్థి



చివరి నిమిషంలో వెళ్తున్న విద్యార్థి



కేంద్రం వద్ద ఫొటోలు అంటిస్తున్న విద్యార్థుల బంధువులు



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, వారి బంధువులు

వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన నీట్ సాఫీగా సాగింది. జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. ఇక కొందరు మాత్రం చివరి నిమిషంలో హడావుడిగా వచ్చారు. చెవిదిద్దులు, కాళ్ల పట్టీలు, మెడలో గొలుసులను అనుమతించేది లేదని చెప్పడంతో అక్కడికక్కడే తీసి తల్లిదండ్రులకు ఇవ్వడం కనిపించింది.

– ఖమ్మం సహకారనగర్

వైరాలో వరుస చోరీలు

- రోజు వ్యవధిలో రెండిళ్లలో దుండగుల హస్తలాఘవం
- బెంబేలెత్తుతున్న స్థానికులు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి సుందరయ్యనగర్‌లోని ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సుందరయ్యనగర్‌కు చెందిన బేకరీ వ్యాపారి వజినేపల్లి రవి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తిరుపతి వెళ్లారు. ఇంటికి తాళాలు వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు అర్ధరాత్రి సీసీ కెమెరా వైర్లు కత్తిరించాక తలుపులు, కిటికీలు పగులగొట్టి లోనకు ప్రవేశించారు. అయితే, ఇంట్లో విలువైన వస్తువులేమీ లేకపోవడంతో టీవీ, ఆరుబయట పార్క్ చేసి స్కూటీ ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని ఆదివారం ఉదయం గుర్తించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో రవి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక 12వ వార్డులోని నాళ్ల శ్రీకాంత్ ఇంట్లో సైతం చోరీ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శ్రీకాంత్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి తమ బంధువుల ఇంటికి వెళ్లారు. దీంతో దుండగులు ఇంటి తలుపు గడియను స్క్రూడ్రైవర్‌తో చాకచక్యంగా తీసి ఇంట్లోని బీరువా తాళాలు పగులగొట్టారు. అందులో భద్రపర్చిన మూడు తులాలు బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదుతో పాటు మరి కొన్ని వెండి వస్తువులను అపహరించారు. శ్రీకాంత్ కుటుంబం ఆదివారం సాయంత్రం వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తింపు పోలీసులు ఫిర్యాదు చేశారు.

ప్రధాన రహదారుల్లోనే పెట్రోలింగ్

వైరా మున్సిపాలిటీ పరిధిలో వేసవి సెలవుల దృష్ట్యా పలువురు బంధువుల ఇళ్లకు, విహారయాత్రలకు వెళ్లడాన్ని ఆసరాగా చేసుకున్న దొంగలు తమ పనికానిచ్చేస్తున్నారు. ఉదయం తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి చోరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, రాత్రి వేళ పోలీసు పెట్రోలింగ్ కేవలం ప్రధాన రహదారులకే పరిమితం కావడంతో గల్లీల్లో దుండగులు స్వైర విహారం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా రాత్రి వేళ పెట్రోలింగ్ ముమ్మరం చేసి దొంగల బెడదన అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పరిహారం చెల్లింపులో రాష్ట్రప్రభుత్వం విఫలం

బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

వైరా: రాష్ట్రంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. వైరా శాంతినగర్‌లోని అయ్యప్ప స్వామి క్షేత్రంలో శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవానికి ఆదివారం ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు గంటల వ్యవధిలో పరిహారం చెల్లిస్తామని సీఎం కేసీఆర్ చెప్పగా.. నెల గడుస్తున్నా పరిహారం జమ కాలేదని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంట నష్టపోయిన రైతులు ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని సీఎం కేసీఆర్ ఇతర పార్టీలతో జతకడుతున్నారని ఆరోపించారు. కాగా, తాను కరుడుగట్టిన కాంగ్రెస్‌వాదినే అయినా పార్టీలో క్రమశిక్షణ తప్పడంతో బీజేపీలో చేరానని తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గల్లా సత్యనారాయణ, భూక్యా శ్యాంసుందర్ నాయక్‌తో పాటు నాయకులు నెల్లూరి కోటేశ్వరరావు, రంగాకిరణ్, శ్యాంరాథోడ్, విష్ణుకాంత్, షేక్.పాషా, కోసూరి వెంకటకృష్ణ, గోపాలకృష్ణ, దార్ల శంకర్, దీకొండ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం పనిచేద్దాం..

టీడీపీ జాతీయ క్రమశిక్షణా సంఘం సభ్యుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న బంటు వెంకటేశ్వర్లు, పక్కన కూరపాటి తదితరులు

సత్తుపల్లి: బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆశయ సా ధన కోసం అందరూ పాటుపడాలని టీడీపీ జాతీయ క్రమశిక్షణా సంఘం సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. సత్తుపల్లిలో శనివారం ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మినీమహానాడు, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు కూరపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఈ సమావేశం జరగగా, తొలుత వెంగళరావునగర్ నుంచి సభాప్రాంగణం వర కు ప్రదర్శనగా చేరుకుని ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలకు ఆద్యుడని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు టిక్కెట్లు కేటాయించాకే మిగిలిన సీట్లకు అభ్యర్థులను వెల్లడిస్తామని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారన్నారు. కాగా, నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ లబ్ధి జరిగిందని, ఈ ప్రభుత్వాన్ని గద్దెదింపే వరకు టీడీపీ శ్రేణులు శ్రమించాలని కో రారు. టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తనయుడు వీరేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లుతెలిపారు. అనంతరం కూరపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజకీయ, సినీరంగంలో విశేష సేవలందించిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్.. ఏ హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ కొందరు ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటును తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని.. కానీ ఎన్టీఆర్, టీడీపీ వేర్వేరు కాదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఈ స మావేశంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి ఎస్.నర్సిరెడ్డి, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు జయరాంతో పాటు వి.చంద్రహాసన్, కాపా కృష్ణమోహన్, కె.గోపి, టి.హరికృష్ణ, రవీంద్రగౌడ్, నాయుడు కోటి, బొంతు శ్రీనివాసరావు, ముప్పిడి శ్యామ్ సుధాకర్, మోరంపూడి రవి, కోట సత్యనా రాయణ పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.30గంటలకు 50వ డివిజన్‌లో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించాక కామేపల్లి మండలానికి మంత్రి వెళ్తారు. మండలంలోని రాయిగూడెం, గోవింద్రాల, నెమలిపురి, పింజరమడుగు, హరిచంద్రాపురం, పాతలింగాల, కొత్తలింగాలల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఆతర్వాత ఖమ్మం కలెక్టరేట్‌లో అధికారులతో ధాన్యం సేకరణపై సమీక్షించాక 3, 9వ డివిజన్లలో పేదలకు ఇళ్ల పట్టాలు, కాల్వొడ్డులో కుట్టుమిషన్లను మంత్రి పువ్వాడ పంపిణీ చేస్తారు.

ప్రేమ పెళ్లి చేసుకున్నాడని యువకుడి ఇంటిపై దాడి

ఏన్కూరు: ప్రేమవివాహం చేసుకున్నాడనే కోపం యువకుడి ఇళ్లు, షాపును యువతి బంధువులు ధ్వంసం చేశారు. ఏన్కూరు మండలం గార్లఒడ్డుకు చెందిన ఉమావెంకట్, ఓ యువతి కొన్నిరోజులుగా ప్రేమించుకుంటున్నారు. అయితే, వీరి పెళ్లికి కుటుంబీకులు అంగీకరించకపోవడంతో నెల క్రితం గ్రామం నుంచి వెళ్లిపోయి ఈనెల 6న వైరాలో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. ఈ విషయం తెలియడంతో అమ్మాయి బంధువులు ఆదివారం అబ్బాయి ఇంటిపై దాడి చేశారు. ఈ ఘటనలో రూ.లక్ష మేర నష్టం జరిగిందని ఆయన తల్లి చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

14న పొంగులేటి ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన ఈనెల 14న ఖమ్మంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేశారు. నగరంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్ వెనుకాల సాయంత్రం 5 గంటలకు ఈ సమ్మేళనం ప్రారంభమవుతుంది. ఈమేరకు నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి కోరారు.

క్లుప్తంగా...



తిరుమల శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభాన్ని మొక్కుతున్న మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ

తిరుమల యాత్ర ఫ్యాషన్‌తో చేసే పిక్నిక్ కాదు

- భక్తితో శ్రీవారిని దర్శించుకోవాలి
- మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ

తిరుమల: తిరుమల యాత్ర ఫ్యాషన్‌తో చేసే పిక్నిక్ కాదని, భక్తితో శ్రీవారిని దర్శించుకోవాలని మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామీజీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తిరుమల శ్రీవారిని వ్యాపార దృష్టితో చూడకూడదని చెప్పారు. భక్తితో స్వామివారిని పూజిస్తే అందరి కోరికలు తీరుతాయన్నారు. పవిత్రమైన తిరుమల పరిసరాలను భక్తులు అపవిత్రం చేయకూడదని సూచించారు.

బండిపై పోస్ట్ పెట్టిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి: బీజేపీ

సాక్షి, హైదరాబాద్ : సామాజిక మాధ్యమాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చనిపోయారని పోస్టు చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రొఫైల్, టీఆర్ఎస్ పేరుతో ఉన్న ఆ ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి ఆ పోస్టు వైరల్ అయిందని, ఆ పోస్టు పెట్టిన వ్యక్తిని 24 గంటల్లోగా అరెస్టు చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమదేవి ఆదివారం డీజీపీని కోరారు. పార్టీ అధికార ప్రతినిధి సీహెచ్ విఠల్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ...బతికున్న బీజేపీ నేతలనే చనిపోయారని పోస్టులు పెట్టే స్థాయికి బీఆర్ఎస్ నేతలు దిగజారిపోయారని మండిపడ్డారు. కరీంనగర్ ప్రజలు పిచ్చోడిని గెలిపించారని మంత్రి కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని ఇప్పటికైనా ఆయన నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. పదవీ విరమణ పొందకుండా సోమేశ్ కుమార్ రాజకీయాల్లో ఎలా తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో సోమేశ్ కుమార్‌పై ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆర్థిక నేరాలకు మార్గదర్శితో ముగింపు!

రిజిస్టర్ చేయకుండా చిట్‌ఫండ్ నడిపిన కేసులో 4 రోజుల పాటు అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో రామోజీ

- కోర్టుల్ని తప్పుదారి పట్టించేలా లెక్కలు చూపించారు
- ఫిర్యాదులు రాకున్నా న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- రామోజీరావు కేసు ముగిసిన కథ అనుకున్నాం
- సీఎం జగన్ ఎస్‌ఎల్‌పీ పిటిషన్ వేయడంతో కేసుకు ఊపిరి వచ్చింది
- టీడీపీకి ఆదిరెడ్డి అప్పారావు అవసరం లేదు.. రామోజీనే ముఖ్యం
- రామోజీ – మార్గదర్శి అక్రమాలపై విశాఖలో 'స్వర్ణాంధ్ర వేదిక' సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్.

సాక్షి, విశాఖపట్నం: రిజిస్టర్ చేయకుండా చిట్‌ఫండ్ నిర్వహించిన కేసులో మార్గదర్శి చైర్మన్ చెరుకూరి రామోజీరావు గతంలో నాలుగు రోజుల పాటు హైదరాబాద్ అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని, అప్పటి నుంచి ఆయన మోసాలు కొనసాగుతూనే ఉన్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వెల్లడించారు. మార్గదర్శి కేసుతోనైనా దేశంలో ఆర్థిక నేరాలకు ఫుల్‌స్టాప్ పడాలని వ్యాఖ్యానించారు. 17 ఏళ్లుగా కొనసాగుతున్న మార్గదర్శి కేసు ఇక ముగిసిన అధ్యాయం అనుకున్న తరుణంలో డిపాజిట్‌దారుల ప్రయోజనాలను కాపాడుతూ సీఎం వైఎస్ జగన్ వేసిన ఎస్‌ఎల్‌పీ పిటిషన్‌తో కొత్త ఊపిరి వచ్చిందని, లక్షల మంది ఖాతాదారులకు ధైర్యం వచ్చిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. విశాఖలోని ఓ హోటల్‌లో ఆదివారం సాయంత్రం స్వర్ణాంధ్రవేదిక ఆధ్వర్యంలో 'రామోజీరావు మార్గదర్శి అక్రమాలు– నిజానిజాలు'అనే అంశంపై నిర్వహించిన సదస్సులో పలువురు మాట్లాడారు.

అబిడ్స్ స్టేషన్‌లో రామోజీ..

ఈనాడుకు మొట్టమొదటి ఎడిటర్ ఉన్న ఏబీకే ప్రసాద్‌కు ఫోన్ చేస్తే.. ఏ పర్మిషన్ లేకుండా చిట్ ఫండ్ కంపెనీ నడుపుతున్నారన్న ఆరోపణలపై రామోజీరావు నాలుగు రోజుల పాటు అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నారన్న కొత్త విషయాన్ని చెప్పారు. ఆ తర్వాతే మార్గదర్శిని రిజిస్టర్ చేశారట. జీవీ రెడ్డి మార్గదర్శిపై చర్చకు వస్తామని ప్రకటించారు. కానీ హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌ని ఈ నెల 14న టీడీపీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ పేరుతో బుక్ చేసుకున్నారు. రామోజీ కోసం ఏమైనా చేస్తామని తద్వారా టీడీపీ నేరుగానే చెబుతోంది.

ఎవరికి ఫిర్యాదు చేయాలి?: ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎంపీ

17 ఏళ్ల తరువాత డబ్బులు ఎవరికి ఇచ్చారో వెల్లడించాలని మార్గదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఘన విజయం సాధించామని చెప్పుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నాం. జూలై 18కి కేసు వాయిదా వేశారు. చాలా ఏళ్లు న్యాయస్థానాల్లో కేసు ఏమిటనేది వినే పరిస్థితి రాలేదు. 2021లో హైకోర్టులో కేసు కొట్టివేసిన తర్వాత ఎస్‌ఎల్‌పీ (స్పెషల్ లీవ్ పిటిషన్)దాఖలు చేశా. ఏడాది తర్వాత ఏపీ ప్రభుత్వం నేరుగా ఎస్‌ఎల్‌పీ వేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరైన టైమ్‌లో స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ వేయడంతో నాకు నమ్మకం వచ్చింది. ఈ కేసు కథ ముగిసిపోతుందనుకున్న తరుణంలో వైఎస్ జగన్ వేసిన ఎస్‌ఎల్‌పీతో మళ్లీ మొదలైంది. దివంగత వైఎస్సార్ అనుకున్నది రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి చేయలేకపోయారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం.. ఎవరికి డబ్బులు చెల్లించారనే వివరాలు బయటకు వస్తే ఈ కేసు ఈడీకి వెళ్తుందా? మనీ ల్యాండరింగ్‌కు కిందకు వెళ్తుందా? చెల్లించిన డిపాజిటర్లు ఎవరు? అనే విషయాలు బయటకు వస్తాయి. మొత్తం 2.36 లక్షల మంది పేర్లు బయటికి వస్తాయి. దీన్ని వచ్చే ఎన్నికల్లో ఇష్యూ చేయాలన్నదే చంద్రబాబు లక్ష్యంగా కనిపిస్తోంది. ఎవరూ కంప్‌లైంట్ ఇవ్వలేదని రామోజీ అంటున్నారు. చిట్ డబ్బులు ఇవ్వకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలి? పోలీస్ స్టేషన్‌లో ఇస్తే తీసుకుంటారా? కలెక్టరేట్‌లో తీసుకుంటారా?

రెండు దశాబ్దాల నిరంకుశత్వం

రామోజీ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న మార్గదర్శితో ఈ వేదికపై ఉన్నవారెవరికీ వ్యక్తిగత ద్వేషాలు లేవు. ఈనాడైనా.. చిత్తు కాగితాలైనా.. పచ్చళ్లయినా.. పరిశ్రమలైనా.. చిట్స్ అయినా.. తానే చేయాలన్నదే రామోజీరావు కాన్సెప్ట్. చిన్నవాడెవడూ బతకకూడదు. ఆయనకి యాడ్స్ ఇవ్వకపోతే వ్యతిరేకంగా వార్తలు రాయడం నిత్యకృత్యమైంది. అధికార శక్తి, మీడియా శక్తి ఏకమైతే ఎంత భయంకరంగా ఉంటుందో గత రెండు దశాబ్దాలుగా రామోజీ రూపంలో చూస్తున్నాం. మార్గదర్శి అక్రమాలపై త్వరలో తిరుపతిలో సదస్సు నిర్వహిస్తాం.

– కేబీజీ తిలక్, స్వర్ణాంధ్ర దినపత్రిక ఎడిటర్

'చంద్రమతి మాంగల్యం'.. మార్గదర్శి ఆస్తులు!

డిపాజిటర్లు మోసపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా వ్యవహరించి డిపాజిటర్లను కాపాడింది. కొత్త అప్పులు రెండు లక్షల మందికిపైగా డిపాజిటర్లకు గుదిబండగా మారనున్నాయి. అనుబంధ కంపెనీలకు నిధులు ఎలా బదలాయిస్తారు? 'చంద్రమతి మాంగల్యం' మాదిరిగా ఆస్తులు వారికి మినహా ఇతరులకు కనపడటం లేదు. అగ్రిగోల్డ్, సహారా మోసాలు జరిగిపోయాయి. డిపాజిట్ రసీదుపై రామోజీరావు సంతకం ఉంటుంది. డిశ్చార్జ్ రసీదుపై ప్రొప్రైటర్ సంతకం చేయడం నిబంధనలకు విరుద్ధం.

– శర్మ, ప్రముఖ న్యాయవాది.

అదే బాటలో ధనలక్ష్మి, కార్తికేయ...

రామోజీని చూసి మిగిలిన చిట్స్ కూడా మోసాల బాట పడుతున్నాయి. రామోజీ ఏం చేస్తున్నారో అందరూ అదే చేస్తున్నారు. మూడు నెలల క్రితం కాకినాడలో ధనలక్ష్మి సొసైటీ, నెల క్రితం కార్తికేయ సొసైటీ మూతపడ్డా పోలీసులు ఏమీ చేయలేకపోయారు. ఎర్రన్నాయుడి వియ్యంకుడైన ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడిని ఇదే మోసం కారణంగా అరెస్టు చేశారు. రామోజీని అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు తీర్పు వచ్చింది. మరి అలాంటప్పుడు అప్పారావును ఎందుకు అరెస్టు చేశారని ఆయన్ను పరామర్శించేందుకు వచ్చిన చంద్రబాబు ఎందుకు ప్రశ్నించలేదు? ఇద్దరికీ చెరో నీతా? రామోజీని ఇంటికెళ్లి విచారిస్తారు.. అప్పారావును ఎందుకు అరెస్టు చేస్తారు? అని అడగాలి కదా! ఆదిరెడ్డి అప్పారావు ఏమైనా పర్వాలేదు కానీ రామోజీకి ఏమీ జరగకూడదని టీడీపీ స్టాండ్ తీసుకుంది.



సదస్సుకు హాజరైన ప్రముఖులు

బ్రహ్మయ్య కంపెనీలో వందల ఫిర్యాదులు

మార్గదర్శి, డాల్ఫిన్, ప్రియా ఫుడ్స్, ఈనాడుతో 1979 నుంచి నాకు అనుబంధం ఉంది. ఉండవల్లి పోరాటం జరిగిన తర్వాత రామోజీ మోసాలు ప్రతి ఒక్కటీ గుర్తుకొచ్చాయి. 100 టన్నుల న్యూస్ ప్రింట్ పేపర్ దిగుమతి చేసుకుంటే 90 టన్నులు మాత్రమే వినియోగించేవారు. ఇలాంటి ఎన్నో మోసాలు నా కళ్లముందే జరిగాయి. మా మామయ్య కేఎస్ రెడ్డి అన్నదాత ఎడిటర్‌గా ఉండేవారు. రామోజీ ప్రజల డబ్బులతో హోటల్స్.. ప్రింటింగ్ ప్రెస్‌లు, బిల్డింగ్‌లు కడుతున్నారని, చివరకు ఏమవుతుందోనని మామయ్య ఆందోళన చెందేవారు. చట్టాల్లో లొసుగులను అడ్డు పెట్టుకొని తప్పించుకోవడం రామోజీరావుకి వెన్నతో పెట్టిన విద్య. టీడీపీ నుంచి వచ్చిన జీవీ రెడ్డికి, మార్గదర్శికి ఏం సంబంధం? మా గ్రామంలో ఒక వ్యక్తికి చిట్ అయిపోయిన 9 ఏళ్ల తర్వాత డబ్బులిచ్చారు. నేను ఆడిట్ చేసిన సమయంలో బ్రహ్మయ్య అండ్ కంపెనీలో మార్గదర్శిపై కొన్ని వందల కంప్‌లైంట్స్ ఉన్నాయి.

– నాగార్జునరెడ్డి, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్

అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు

- 11న సంగారెడ్డిలో నిరుద్యోగ మార్చ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్ : బీజేపీ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేదాకా పోరాడుతామన్నారు. ఇందులోభాగంగా ఈనెల 11న ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రంలోని సంగారెడ్డిలో నిర్వహిస్తున్న 'నిరుద్యోగ మార్చ్'కు నిరుద్యోగులు, ప్రజాస్వామికవాదులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన తీరును 'నిరుద్యోగ మార్చ్'ద్వారా ప్రజల్లో ఎండగడతామని తెలిపారు. వచ్చే నెలలో హైదరాబాద్ లో ''మిలియన్ మార్చ్''నిర్వహించి ప్రభుత్వానికి కళ్లు తెరిపిస్తామన్నారు. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేటీఆర్ మంత్రి పదవికి రాజీనామా చేసేదాకా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూపీఎస్సీ తరహాలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని హామీనిచ్చారు.

అల్లూరికి నివాళి..

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాయంలో అల్లూరి చిత్రపటానికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు చింతల రామచంద్రారెడ్డి, గౌతమ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రకు చెందిన 'భూమి పుత్ర సంఘటన'బీఆర్ఎస్ పార్టీలో ఆదివారం నాడు విలీనమైంది. సంఘటన సంస్థాపక అధ్యక్షుడు సంతోష్ వాడేకర్‌తో పాటు సంఘం నేతలు.. కిరణ్ వాబాలే, అవినాశ్ దేశ్‌ముఖ్, అశోక్ అందాలే, రాజన్ రోక్డే, ఆసిఫ్ బాయి షేక్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సమాధాన్ అరిన్కొండ, ఆప్‌కి చెందిన దీపక్ కొంపెల్వార్, యోగితా కొంపెల్వార్, రాము చౌహాన్, భారీ త్రిలోక్ జైన్, సంతోష్ కాంబ్లే, అఖిల్ భారతీయ క్రాంతి దళ్ సంఘటనకు చెందిన లక్ష్మీకాంత్ భంగే కూడా బీఆర్ఎస్‌లో చేరారు. నిఖిల్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో.. గోండ్వానా పార్టీ విదర్భ అధ్యక్షుడు ప్రణీత వీకేసీ, యావత్మాల్‌కు చెందిన సామాజిక కార్యకర్త వర్ష కాంబ్లే కూడా బీఆర్ఎస్‌లో చేరారు. విదర్భకు చెందిన మహిళా బచత్ ఘాట్ మహిళా కమిటీ అధ్యక్షురాలు కల్పన, పూనమ్ అలోర్‌లు.. బీఆర్ఎస్‌కు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బాల్క సుమన్ పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ సభ్యుడిగా మాధవనాయక్



సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా స్థాయి సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డ్ సభ్యుడిగా ఏబీకేఎంఎస్(బీఎంఎస్) నేత మాధవ నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ జాతీయ కమిటీ బాధ్యులు ఆదివారం కోలిండియా చైర్మన్‌కు లేఖ పంపించారు. ఈ మేరకు బోర్డులో బీఎంఎస్ తరఫున మాధవనాయక్ ప్రాతినిధ్యం వహించనుండగా, ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు.

సాంకేతిక లోపంతో నిలిచిన కోణార్క్



నిలిచిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్

బోనకల్/ఖమ్మంమామిళ్లగూడెం: బోనకల్ మండలం గోవిందాపురం(ఏ)–మోటమర్రి రైల్వేస్టేషన్ మధ్య ఆదివారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. ముంబై నుంచి భువనేశ్వర్ వెళ్లాల్సిన ఈ రైలు ఖమ్మం స్టేషన్‌కు ఉదయం 7–15 గంటలకు రావాల్సిఉండగా, ఆలస్యంగా 8–50 గంటలకు వచ్చింది. అనంతరం బయలుదేరిన రైలు ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో గోవిందాపురం వద్ద 9–30నుంచి గంటపాటు నిలిచిపోగా మిగతా రైళ్ల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు పడిగాపులు కాశారు. ఇంజన్ మరమ్మతుల అనంతరం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను పంపించిన రైల్వే అధికారులు, ఆతర్వాత మిగతా రైళ్ల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

మణుగూరుకు మరో రైలు!

- సికింద్రాబాద్ నుంచి మొదలైన 'బెళగావి' ఎక్స్‌ప్రెస్
- జనవరిలో ప్రకటన... ఇప్పుడు అమలు
- ఇది రెండో రైలు.. మరిన్ని పొడిగించాలని వినతులు



మణుగూరు రైల్వేస్టేషన్

మణుగూరుటౌన్: మణుగూరు వాసులకు మరో రైలు అందుబాటులోకి వచ్చింది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న బెళగావి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభమైంది. అయితే, కరోనా ముందు మాదిరి కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్‌ను మణుగూరు వరకు పొడిగించడమే కాక కాజీపేట నుంచి నడిచిన ప్యాసింజర్ రైలును సైతం పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ ఏడాది మొదట్లోనే ప్రకటన

కరోనాకు ముందు సికింద్రాబాద్ – మణుగూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, కాకతీయ ఎక్స్‌ప్రెస్, కాజీపేట నుంచి మరో ప్యాసింజర్ రైలు మణుగూరుకు రాకపోకలు సాగించేవి. అయితే, కరోనా తర్వాత సికింద్రాబాద్ – మణుగూరు రైలును పునరుద్ధరించినా కాకతీయ రైలును కొత్తగూడెం వరకే పరిమితం చేశారు. ఇక కాజీపేట నుంచి నడిచే ప్యాసింజర్‌ను మొదలేపెట్టలేదు. దీంతో స్థానికుల ఇబ్బందుల దృష్ట్యా బెళగావి నుంచి సికింద్రాబాద్ వరకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును మణుగూరుకు వరకు పొడిగిస్తామని అధికారులు ఈ ఏడాది జనవరిలో ప్రకటించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. తాజాగా ఆదివారం నుంచి అధికారులు రైలును ప్రారంభించారు. తద్వారా ఇన్నాళ్లు సికింద్రాబాద్ నుంచి కొత్తగూడెం, మణుగూరు వచ్చే వారికి రాత్రి పూట మాత్రమే రైళ్లు అందుబాటులో ఉండగా, ఇప్పుడు ఉదయం పూట కూడా రైలు సౌకర్యం సమకూరినట్లయింది.

ఈనెల 31వ తేదీ వరకేనట!

బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్ నుంచి మణుగూరు వరకు పొడిగిస్తున్నట్లు అధికారులు ప్రకటించినా ఈ నిర్ణయం 31వ తేదీ వరకే అమల్లో ఉంటుందని వెల్లడించారు. ఆతర్వాత ప్రయాణికుల ఆదరణ దృష్ట్యా పొడిగించే అవకాశముందని చెబుతున్నారు. కానీ స్థానిక అధికారులను సంప్రదిస్తే రైలును కచ్చితంగా కొనసాగించే అవకాశాలు ఉన్నాయని.. కాకపోతే ఎప్పటికప్పుడు ప్రకటన విడుదల చేస్తారని వెల్లడించారు.

రాకపోకలు ఇలా...

బెళగావి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతిరోజు సికింద్రాబాద్ స్టేషన్‌లో ఉదయం 5.25 గంటలకు బయలుదేరుతుంది. ఉదయం 10.45 గంటలకు కొత్తగూడెం స్టేషన్‌కు చేరుకుని మణుగూరుకు వెళ్తుంది. తిరిగి సాయంత్రం 3.40 గంటలకు బయలుదేరి 4.50 గంటలకు కొత్తగూడెం, ఆపై సికింద్రాబాద్ వెళ్తుంది.

అందరికీ ఉపయోగం



మణుగూరు నుంచి సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే వారికి బెళగావి ఎక్స్‌ప్రెస్ ఎంతో ఉపయోగపడుతుంది. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు రైలును పొడిగించడం ఆనందంగా ఉంది. ప్రజలు సద్వినియోగం చేసుకుంటే రైలును ఎప్పటికీ నడిపేంచే అవకాశముంది.

– గుడిపూడి కోటేశ్వరరావు, ఎంపీటీసీ మణుగూరు

ప్రయాణికులకు వెసులుబాటు



బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను మణుగూరు వరకు నడపడం వల్ల ప్రయాణికులకు వెసలుబాటుగా ఉంటుంది. మణుగూరు నుంచి సికింద్రాబాద్, బెళగావి వెళ్లాలనుకునే ఎంతో ప్రయోజనకరం. సుదూర ప్రాంతాలకు సైతం సుఖవంతంగా ప్రయాణం చేయడానికి ఈ రైలు ఎంతో ఉపయోగపడుతుంది.

– శంకర్, ఉపాధ్యాయుడు, మణుగూరు

మరిన్ని రైళ్లు పొడిగించాలి



మణుగూరు వరకు ప్రస్తుతం కేవలం మణుగూరు ఎక్స్‌ప్రెస్ మాత్రమే కొనసాగుతుంది. ఇప్పుడు బెళగావి ఎక్స్‌ప్రెస్ మొదలైంది. కానీ ఈ నెలాఖరు వరకే ఉంటుందని చెబుతున్నారు. అలాకాకుండా నిత్యం నడిపించడంతో పాటు మరిన్ని రైళ్లను మణుగూరు వరకు కొనసాగించాలి.

–ఎస్.డీ.నాజర్ పాషా, సింగరేణి కార్మికుడు, మణుగూరు

క్రీడలతో శారీరక దృఢత్వం

ఇన్‌కం టాక్స్ రాష్ట్ర కమిషనర్ జీవన్‌లాల్

జూలూరుపాడు: క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, ఐకమత్యానికి దోహదపడతాయని ఇన్‌కం టాక్స్ రాష్ట్ర కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ అన్నారు. జూలూరుపాడులో జీఎస్‌టీయూహెచ్ జేఏసీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్స్‌లో మణుగూరు, జూలూరుపాడు జట్లు తలపడగా మణుగూరు జట్టు విజేతగా నిలిచింది. ఈమేరకు జీవన్‌లాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మణుగూరు జట్టుకు రూ.75వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన జూలూరుపాడు జట్టుకు రూ.50వేల నగదుతో పాటు ట్రోఫీలు అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు మందా రంజిత్‌కుమార్, ఎంపీపీ లావుడ్యా సోనీ, సీఐ జె.వసంతకుమార్‌తోపాటు లకావత్ గిరిబాబు, పొన్నెకంటి సతీష్‌కుమార్, ఎదళ్లపల్లి వీరభద్రం, చౌడం నర్సింహారావు, కొదుమూరి కోటేశ్వరరావు, కాశ్లూరు వెంకటేశ్వరరావు, బి.సందీప్, జి.సురేష్‌యాదవ్, పి.రమేష్, దినేష్, సాయివంశీ, నరేష్, రవి, మౌళి, మనోజ్, రమేష్ పాల్గొన్నారు.



మణుగూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జీవన్‌లాల్, తదితరులు

కడుపుబ్బా నవ్వించిన 'వంద నవ్వుల విందు'

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్రంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన 'వంద నవ్వుల విందు' కార్యక్రమం ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మొగిలి గుణాకర్ నేతృత్వాన మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సినీ, టీవీ హాస్యనటులు తమ స్కిట్లతో ప్రేక్షకులకు హాస్యం పంచారు. ఈమేరకు డేవిడ్‌రాజు, కుమారి, ఈశ్వర్ బహదూర్, రమేష్, హాస్యవల్లరి, బాబా షరీఫ్, నల్లగట్ల కిషోర్, వరుణ్ తదితరులతో పాటు ఫైర్ రవి తదితరులు ఇచ్చినట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా మహిళా ప్రాంగణం అధికారి, కళాపరిషత్ అధ్యక్షురాలు డాక్టర్ వేల్పుల విజేత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత కళాకారులు డాక్టర్ నాగబత్తిని రవి సతీమణి మాలతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మిత్ర గ్రూప్ చైర్మన్ కురువెళ్ల కురువెళ్ల ప్రవీణ్, నాగబత్తిని రవి మాట్లాడగా డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, వేముల రవికుమార్, నెలనెలా వెన్నెల నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, న్యాయవాది జాబిశెట్టి పాపారావు, బండి వీరభద్రరావు, పుసులూరి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



హాస్యాన్ని పండిస్తున్న మొగిలి గుణాకర్ తదితరులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విజేత, రవి, ప్రవీణ్‌కుమార్ తదితరులు

గూడు.. గిజిగాడు!

గిజిగాళ్లు అల్లుతున్న గూళ్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. నివాసం కోసం గడ్డి పొరకలను నోట్లో కరుచుకుని తీసుకొచ్చి పక్కాగా, పకడ్బందీగా గూళ్లను అల్లుతున్నాయి. వర్షం, గాలిదుమారానికి సైతం చెక్కుచెదరకుండా నిలిచేలా గూళ్లు కట్టుకుంటున్న గిజిగాళ్లు తిరుమలాయపాలెం మండలం బచ్చోడు వద్ద కనిపించాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్









'నీట్' రాసిన తండ్రీకుమార్తె

వైద్యకళాశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన నీట్‌కు ఖమ్మంలో తండ్రీకుమార్తె హాజరయ్యారు. ఖమ్మంలోని హార్వెస్ట్ స్కూల్ కేంద్రంలో డాక్టర్స్ మెడికల్ అకాడమీ డైరెక్టర్ రాయల సతీష్‌బాబు పరీక్ష రాయగా, ఆయన కుమార్తె జోషిక స్వప్నిక బ్లూమింగ్ మైండ్స్ స్కూల్ కేంద్రంలో పరీక్ష రాసింది. ఆయా కేంద్రాల వద్ద వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. – ఖమ్మం సహకారనగర్



జోషిక స్వప్నిక



సతీష్‌బాబు